# శాంతియుత మార్గం సదా అనుసరణీయం

- అహింసా మార్గంలోనే గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు
- బాపూజీ స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ సాధించారు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- జాతిపిత అడుగు జాడల్లో నడుద్దాం
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- పబ్లిక్‌గార్డెన్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద నివాళి


పబ్లిక్‌గార్డెన్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, చీఫ్‌విప్ దాస్యం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : సత్యం, అహింస మార్గంలో బ్రిటిష్ వారి నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు గాంధీ అని, ఆయన చూపిన మార్గం సదా అనుసరణీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గాంధీ మార్గంలోనే స్వరాష్ట్రం సాధించి, వలసలు తగ్గించిన మహనీయుడు మన సీఎం కేసీఆర్ అని అన్నారు. దేశానికి గాంధీజీ స్వాతంత్ర్యం తెస్తే, మన రాష్ట్రానికి కేసీఆర్ స్వాతంత్ర్యాన్ని తెచ్చారన్నారు. గాంధీ కలలను సాకారం చేసింది సీఎం కేసీఆరే అని అన్నారు. గాంధీ ఎప్పుడూ గ్రామాలు అభివృద్ధి చెందాలని కోరుకునేవారని, వలసలు తగ్గినప్పుడే గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆ మాటలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామాన్ని కడిగిన ముత్యంలా తయారు చేశామన్నారు. మన గ్రామాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దామని, స్వచ్ఛభారత్‌లో మన రాష్ట్రమే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆదర్శ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తే మన రాష్ట్రమే నంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు. దేశంలో సంపూర్ణ ఓడీఎఫ్ రాష్ట్రం కూడా మన తెలంగాణనేనని అన్నారు. ఇవేగాక రైతులకు నూతన రెవెన్యూ చట్టం, రైతు బంధు, రైతు బీమా లాంటి పథకాలు అందజేసి, వారి కష్టాలు తీరుస్తున్నారన్నారు. చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు.

# రూ.100 కోట్లతో హనుమకొండ బస్‌స్టేషన్ నిర్మాణం

- జీ+2 అంతస్తులు, అత్యాధునిక వసతులు
- 6న శంకుస్థాపన చేయనున్న కేటీఆర్
- అదే రోజు కాళోజీ ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్


కాళోజీ కళాక్షేత్రం వద్ద పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : హనుమకొండ బస్‌స్టేషన్‌ను రూ.100 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్లు చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఆయన సోమవారం హనుమకొండ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ నెల 6న మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బస్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని చీఫ్‌విప్ తెలిపారు. 35 ప్లాట్‌ఫారాలు, జీ+2 అంతస్తులు, అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం జే శ్రీలత పాల్గొన్నారు.

**6న కాళోజీ ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం**

వరంగల్ : తెలంగాణ వైతాళికుడు, ప్రజా కవి కాళోజీ నారాయణరావు పేరున నిర్మించిన కళాక్షేత్రంలోని ఆర్ట్ గ్యాలరీని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు.నగర పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కాళోజీ ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించారు. ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. 6 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాళోజీ ఫౌండేషన్ సభ్యుల సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలకు మకుటంగా వరంగల్

- ఆటలతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత
- ఏషియన్ గేమ్స్‌లో దేశం ఎన్నో పతకాలు సాధించింది
- ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- జేఎన్ఎస్‌లో 45వ ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు


నృత్యం చేస్తున్న కళాకారిణి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : తెలంగాణలోనే క్రీడలకు వరంగల్ జిల్లా మకుటంగా నిలుస్తుందని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో 45వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అథ్లెటిక్స్ చాంపియన్ షిప్, బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ నెల 5 వరకు జరిగే ఈ క్రీడా పోటీలను తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలు పాల్గొంటున్నాయి. వీటిలో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు, తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు, ఉత్తరప్రదేశ్ పవర్ సెక్టార్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్, తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ 12 టీంలు, 160 క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి సీఎండీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి క్రీడల్లో పాల్గొనడం తెలంగాణకు గర్వకారణమన్నారు. గాంధీ, ఎల్బీ శాస్త్రి జయంతి రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆట పోటీల్లో పాల్గొనడం వలన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఫిట్‌నెస్ చేకూరుతుందన్నారు. ఏషియన్ గేమ్స్‌లో దేశం ఎన్నో పతకాలు సాధించిందన్నారు. దేశంలో కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్‌కు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. వరంగల్ వాసి పిచ్చయ్య బాల్‌బ్యాడ్మింటన్‌లో రాణించారని గుర్తుచేశారు. ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కరీంనగర్, వరంగల్ జట్లు చాలా ఆటల్లో గెలిపొందాయన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బీ వెంకటేశ్వర్‌రావు, సంధ్యారాణి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బీజనార్దన్, ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ప్రధాన కార్యదర్శి కేఆర్ శివకుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఏపీ ట్రాన్స్‌కో, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు టీడీ కుమార్ వడివేలు, సీజీఎం మోహన్‌రావు, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, డీఈలు విజయేందర్‌రెడ్డి, సాంబరెడ్డి, ఆనందం, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్ జగన్నాథ్, కేవీ జాన్సన్ పాల్గొన్నారు.


నయీంనగర్ : 55వ డివిజన్ రజకులకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

# బైక్‌పై వెళ్లి.. సమస్యలు తెలుసుకొని..

- గ్రేటర్ 46, 64వ డివిజన్‌లో ఎమ్మెల్యే అరూరి రమేశ్ పర్యటన
- రూ.13.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సంక్షేమ ప్రభుత్వాన్ని మరో దఫా గెలిపించాలని పిలుపు
- 55వ డివిజన్‌లో 50 మంది రజకులు బీఆర్ఎస్‌లో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

మడికొండ, అక్టోబర్ 2 : అభివృద్ధి, సంక్షేమంలో వర్ధన్నపేట నియోజకవర్గం అగ్రభాగాన నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రేటర్ 46, 64 డివిజన్లలో కుడా, సీడీఎఫ్, స్మార్ట్‌సిటీ నిధులతో చేపడుతున్న రూ.13.25కోట్ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డివిజన్లలో బైక్‌పై తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాలు, కాలనీల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనకడుగు వేయకుండా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. విలీన గ్రామాలకు రూ.400 కోట్లు వెచ్చించి, 3 వేలకు పైగా పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. గ్రేటర్ మున్సిపల్‌లో గ్రామాలను కలిపి గత పాలకులు అన్యాయం చేశారన్నారు. తెలంగాణ వచ్చినంక ఆ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా ఎన్నకున్న నియోజకవర్గ ప్రజలకు పెద్ద జీతగానిలా పనిచేస్తున్నానన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి ఫలాలు మీ కళ్ల ముందే కనుబడుతున్నాయని, పేద బడుగు బలహీన వర్గాల్లో సంతోషం చూసేందుకు సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలను తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, వ్యవసాయం తదితర రంగాల్లో విప్లవం సృష్టించినట్లు తెలిపారు. మన కోసం పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నుకుంటే మిగతా పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, మునిగాల సరోజన పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీలో చేరికలు**

నయీంనగర్ 2: గ్రేటర్ 55వ డివిజన్ పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన సుమారు 50 మంది రజకులు హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే అరూరి రమేశ్ నివాసం ఆవరణలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అరూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలను కాపాడుకుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజితా వెంకటేశ్వర్లు, అటికం రవీందర్, సురేశ్‌కుమార, సుధాకర్, భాగ్యలక్ష్మి, భగత్, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
సబ్ ఎడిటర్లు కావలెను
ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ
వరంగల్ యూనిట్
కార్యాలయంలో పని చేయడానికి
సీనియర్ సబ్ ఎడిటర్లు/సబ్ ఎడిటర్లు
కావలెను.
తెలుగు భాష, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ మీద పట్టు,
ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను
hr@tppl.news మెయిల్ ఐడీకి
ఈ నెల 5 లోగా పంపగలరు.
వివరాలకు 040-23291159